క్లుప్తంగా

పోలీసుల ముమ్మర తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కుజభంగి వెళ్లే మార్గంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా సరిహద్దు గ్రామాల్లో దొంగతనాలు జోరుగా జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాహనదారుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ దొంగతనాలపై సరిహద్దు ప్రజలంతా నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉంటూ, ఎటువంటి అనుమానం వచ్చిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసు శాఖ దొంగతనాల నివారణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టామని, రాత్రి పూట పెట్రోలింగ్ సైతం నిర్వహిస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



కొర్రా రాధిక

అరకులోయ రూరల్: తుపాను ప్రభావానికి ప్రజలు అప్రమతంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక చెప్పారు. ఆమె ఆదివారం విలేకరులతో తుపాను వల్ల గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, దీంతో మన్యంలో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయని, కొన్ని ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నట్టు చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరూ గెడ్డలు, వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దన్నారు. ఈదురుగాలుల ప్రభావంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బోసిపోయిన వారపు సంత



జనం లేని సంత

కొయ్యూరు: భారీ వర్షం కారణంగా ఆదివారం జరిగిన కొయ్యూరు సంత బోసిపోయింది. ఈ సంతకు సమీపంలోని సుమారు 70 గ్రామాల నుంచి ప్రజలు వస్తారు. అయితే నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా సంతకు దూర ప్రాంతాల నుంచి ఎవరు రాలేదు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా సంతలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేసుకున్నారు. కొనుగోలుదారులు రాలేదని కనీసం రవాణా చార్జీలు కూడా రాలేదని, తెచ్చిన సరకులను తిరిగి తీసుకెళ్లాల్సి వచ్చిందని వ్యాపారులు చెప్పారు.

రగ్గుల పంపిణీ



సాధువులకు రగ్గులు పంపిణీ చేస్తున్న వాసవీ హిల్స్ క్లబ్ ప్రతినిధి శ్రీనివాసరావు

సాక్షి, పాడేరు: విశాఖపట్నానికి చెందిన వాసవీ క్లబ్ ప్రతినిధి నరసింగరావు సమకూర్చిన రగ్గులను స్థానిక క్లబ్ ప్రతినిధి శ్రీనాథ శ్రీనివాసరావు సాధువులు, యాచకులకు అందజేశారు.

పర్యాటక ప్రదేశాలు మూసివేత

మారేడుమిల్లి : కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని పర్యాటక ప్రాంతాల్లో సందర్శనను నిలిపివేసినట్టు అటవీ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాల్లో వరదనీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పర్యాటక ప్రదేశాలలో ప్రమాదాలు పొంచి ఉన్నందున ముందస్తు చర్యలో భాగంగా జలతరంగిని, అమృత ధార జలపాతాలు, గుడిసె హిల్ టాప్ తదితర పర్యాటక ప్రదేశాలలో పర్యాటకుల సందర్శనను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంతవరకు ఈ చర్యలు కొనసాగుతాయన్నారు.



జి.మాడుగులలో వర్షానికి దెబ్బతిన్న బావిని పరిశీలిస్తున్న సర్పంచ్ రాంబాబు



వెన్నెలకోటలో కూలిన ఇంటి గోడ



కర్రిముఖిపుట్టులో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

ఉరకలేస్తున్న వాగులు.. నిలిచిన రాకపోకలు

- ఈదురుగాలులకు రోడ్డుపై కూలిన చెట్లు
- ప్రయాణాలకు అంతరాయం
- కూలిన ఇళ్లు.. వాపోతున్న బాధితులు
- వరదనీటిలో పంటపొలాలు.. ఆందోళనలో రైతులు



చెరపల్లిలో కూలిన ఇంటి వద్ద బాధితురాలు

ముంచంగిపుట్టు/హుకుంపేట/జి.మాడుగుల/చింతపల్లి రూరల్/కొయ్యూరు/రాజవొమ్మంగి/: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా గత కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామాల్లో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఈదురుగాలులకు భారీ వృక్షాలు, చెట్లు పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారుల్లో వరదనీరు ముంచెత్తింది. పొలాలన్నీ ముంపు బారిన పడ్డాయి. పంటలు మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలిన ఇళ్లు.. ముంపులో పొలాలు

ముంచంగిపుట్టు మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ కేంద్రంలో పి.ఆర్.రోడ్డుపై ఆదివారం మధ్యాహ్నం భారీ చెట్టు కూలడంతో రాకపోకలు నిలిచాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ పాలిమొత్తి భర్త అర్జున్, పంచాయతీ కార్యదర్శి చిన్నాన్న, వీఆర్‌వో పద్మారావు, సచివాలయ కన్వీనర్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గ్రామస్తుల సహకారంతో తీవ్రంగా శ్రమించి చెట్టును రోడ్డుపై నుంచి తొలగించారు. దీంతో రాకపోకలకు మార్గం సుగుమం అయింది. పంచాయితీ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ గ్రామ పెద్దలు నీలకంఠం పాత్రో, చిరంజీవి తదితరులున్నారు. జి.మాడుగుల మండల కేంద్రంలోని పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద తాగునీటి బావి కూలింది. దీన్ని సర్పంచ్ కిముడు రాంబాబు పరిశీలించారు. వంజరి పంచాయతీ వెన్నెలకోట గ్రామంలో వర్షానికి కొర్ర మాణిక్యం ఇల్లు ముందు భాగం కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని మాణిక్యం కోరుతున్నారు. వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను సర్పంచ్ ఐసరం హనుమంతరావు పరిశీలించారు. చింతపల్లి మండలం బలపం పంచాయితీ చెరువూరు వాగు వర్షాలకు ఆరు అడుగుల ఎత్తుకు పొంగి ప్రవహిస్తుంది. మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 700 మంది గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలకు లోతుగెడ్డ పంచాయతీ చెరపల్లి గ్రామానికి చెందిన గెమ్మిల చిన్నమ్మి ఇల్లు కులిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. కొయ్యూరు మండలంలోని రత్నంపేట–పాడి మధ్య వంతెన సగం కొట్టుకుపోయింది. సుమారు పది గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.గొట్టుపాడు కాలువ ఉధృతితో 15 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కొంత మంది ఆదివారం ఉదయం అడ్డతీగల మండలం వెదురునగరానికి సరకులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. తరువాత కాలువ ఉధృతితో దాటలేకపోయారు. కొంతమంది చెట్ల కొమ్మలను పట్టుకుని అవతలవైపునకు వెళ్లారు. రాజవొమ్మంగి మండల కేంద్రంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న వట్టిగెడ్డ వాగు దాటలేని పరిస్థితి వల్ల గ్రామస్తులు గంటల కొద్దీ పడిగాపులు కాశారు. స్థానిక యువకులు 20 కిలోమీటర్లు దూరం ప్రయాణించి అక్కడున్న వారికి ఆహారం, తాగునీరు అందించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ వెంకయ్య, హెచ్‌సీ సత్యనారాయణ తదితరులు వాగులు దాటకుండా పహారా ఉన్నారు.

సీలేరుకు రెండు కిలోమీటర్ల దూరంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్ఐ రామకృష్ణ స్పందించి అధికారులకు సమాచారం ఇవ్వడంతో జేసీబీతో చెట్టును తొలగించారు.



వట్టిగెడ్డ వాగు దాటేందుకు పడిగాపులు పడుతువున్న రైతులు



లబ్బర్తి వాగు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ వెంకయ్య



నల్లగొండ–పెదమాకవరం మధ్యలో కొట్టుకుపోయిన కాజ్‌వే



కోతకు గురైన రత్నంపేట–పాడి వంతెన



వర్షాల కారణంగా పొంగి ప్రవహిస్తున్న చెరువూరు వాగు



పొక్లెయిన్‌తో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

ఉధృతంగా ప్రవహించే వాగులు దాటొద్దు



వెదురునగరంలో వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగమణి, సిబ్బంది

అడ్డతీగల: భారీ వర్షాల వల్ల కొంగవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటే ప్రయత్నాలు చేయవద్దని తహసీల్దార్ పి.నాగమణి అన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి కొండవాగుల పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అడ్డతీగల మండలం వెదురునగరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వెదురునగరం వాగును సిబ్బందితో కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు.వాగుల పరీవాహక గ్రామాల ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగుల నుంచి రాకపోకలు సాగించవద్దన్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ముందుచూపు లేకుండా ఏ ఒక్కరూ వాగుల్లోనికి దిగరాదన్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల రవెన్యూ సిబ్బందికి తగిన సమాచారం ఇచ్చి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

వీఆర్ పురం: గోదావరి, శబరి నదులకు వరద తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి వరద పరిస్థితిపై సమీక్షించారు. వరద ప్రభావానికి గురయ్యే గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం అన్నవరం వాగు సప్టాను ఆమె పరిశీలించారు. అక్కడి నుంచి వడ్డిగూడెం గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపీడీవో ఆర్.హణేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు

సచివాలయ భవనం త్వరగా పూర్తి చేయాలి

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలోని నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం భవనం వెంటనే పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ భవనం అసంపూర్తిగా వదిలేయడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత్యంతరం లేక ప్రసుత్తం శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనంలో బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలన్నా ఆ భవనం కారిపోతుందని, విలువైన రికార్డులు తడిసిపోతున్నాయని, సామగ్రి పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన సచివాలయ భవనం పనులు వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

కోయ భాషకు అధికారిక గుర్తింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

ఎటపాక: కోయ(గోండి) భాషకు అధికారిక గుర్తింపు ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటకమణ కోరారు. ఆదివారం కోయ భాషా దినోత్సవరం సందర్భంగా కేఎస్ పురం ఆశ్రమ పాఠశాలలో ఆదివాసీ సంక్షేమ పరిషత్,ఆదివాసీ టీచర్ అసోసియేషన్, ఉద్యోగ సంక్షేమ పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న భాషలో కోయ భాష ఒకటని దాన్ని పరిరక్షించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను మాట్లాడుతూ..లిపి లేని కారణంగా కోయ భాష అంతరించి పోయే భాషలో ఉందని, ఈ మేరకు రక్షణకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రామకృష్ణ, అనిల్, దేశయ్య, శంకరయ్య తదితరులున్నారు.

ఘనంగా బోనాల పండగ



వెదురునగరంలో బోనాలతో భక్తులు

వై.రామవరం: గురుపౌర్ణమిని పురస్కరించుకొని మండల సరిహద్దు గ్రామమైన వెదురునగరం శివ సాయిభువనేశ్వరి ఆశ్రమంలో ఆదివారం మహంకాళీ అమ్మవారి బోనాల పండుగను ఆశ్రమ నిర్వాహకులు శ్రీసాయిరామ్ గురు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలోని కాలికామాతకు, వారాహిమాతకు బోనాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం దేవరమడుగులు గ్రామ పెద్దేరు వాగులో బోనాలను నిమజ్జనం చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అర్చకులు రాజారెడ్డి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



ముంచంగిపుట్టులో పూజలు చేస్తున్న భక్తులు



పాకలపాటి గురుదేవుల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నాగబందం రాతి విగ్రహాన్ని గిరిజనులకు అందజేస్తున్న వెంకటరామయ్య



మోతుగూడెంలో గురుపౌర్ణమి పూజల్లో భక్తులు

అరకులోయ రూరల్/పెదబయలు/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/మోతుగూడెం/రాజవొమ్మంగి/అడ్డతీగల: జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయిబాబా మందిరాలు ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నసమారాధన జరిగింది. సాయంత్రం పల్లకిసేవా కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఘనంగా జరిగింది. భజన, సత్సంగ్ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రం ద్వారా మారేడుమిల్లి మండలం బందంవారిపేట వీధి గ్రామ గిరిజనుల కోరిక మేరకు నాగబందం రాతి విగ్రహం వితరణ చేసినట్టు పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈ మేరకు రాతి విగ్రహాన్ని ఆ గ్రామ గిరిజనులకు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



శరభవరంలో పల్లకిసేవలో భక్తులు



పాడేరులో పూజలు చేస్తున్న భక్తులు

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



రాజవొమ్మంగి ఎంపీపీ వెంకటలక్ష్మి



వీరాయిగూడెంలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎటపాక: గోదావరి వరదల్లో ముంపు ప్రాంత ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఐవి కోరారు. వీరాయిగూడెంలో వరద ముంపు ప్రాంతాన్ని ఆయన ఆదివారం సందర్శించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ముంపు వల్ల రాకపోకలు లేని ప్రాంతాల్లో బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతవారం రోజులుగా తుపాను ప్రభావంతో నిత్యావసరాలు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఇప్పుడు వరదలు అతలాకుతలం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ముంపు ప్రాంత బాధితులను ఆదుకోవాలన్నారు.

రాజవొమ్మంగి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, ముంపు బాధితులకు తక్షణ సాయమందించాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కోరారు. పంటలు మునిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా పోలీసు పహారా ఉండేలా చూడాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

రంపచోడవరం: మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వైపు వెళ్తున్న కారు స్థానిక గురుకుల కళాశాలకు దగ్గరలో దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడినట్టు స్థానికులు చెప్పారు. మలుపు వద్ద వాహనం వేగంగా రావడంతో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. త్రుటిలో ప్రమాదం తప్పినట్టు చెప్పారు.

మొక్కలు పంపిణీ చేయాలి



రామకృష్ణ

గూడెంకొత్తవీధి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మన్యంలో వ్యవసాయానికి అనుకూలమని ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు సకాలంలో ఉద్యాన మొక్కలను పంపిణీ చేయాలని గూడెంకొత్తవీధి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ ఆదివారం కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా డ్రాగన్, ఆవకాడో, జీడిమామిడి, సిల్వర్‌టక్ వంటి వివిధ రకాల మొక్కలను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం వర్షాలు విరివిగా కురుస్తున్నందున త్వరగా మొక్కలు ఇవ్వాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న రైతులందరికీ ఈ మొక్కలను పంపిణీ చేయాలని కోరారు.